క్లుప్తంగా

రేపు రూరల్ మండల సర్వసభ్య సమావేశం

నెల్లూరు రూరల్: రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు, హాజరుకావాలని కోరారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని గోమతినగర్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను దర్గామిట్ట పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రాయప్పకు సన్మానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వతంత్రపార్క్‌లో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేతా అంకులు టస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ రాయప్పను సేవాబంధు పురస్కారంతో సన్మానించారు. బీ శ్రీనివాసులు, కే నాగేంద్ర, వీ మహేష్, కేఎస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిరుల ఖాళీలను భర్తీ చేయాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని బదిరుల ఖాళీల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని జిల్లా బదిరుల అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బదిరుల సంఘ ప్రధాన కార్యదర్శి అవినాష్, నాయకులు వెంకటేష్, ఫణీంద్రబాబు, బాలాజీ పాల్గొన్నారు.

రేపు చిన్నగరుడసేవ

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశి సందర్భంగా రంగనాథస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6.30గంటలకు చిన్నగరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారి సోమవారం తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కృపకుపాత్రులు కావాలని కోరారు.

రబీ నాటికి సర్వేపల్లి కాలువ లైనింగ్ పూర్తి

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్



మహిళలను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సర్వేపల్లి కాలువకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణం పూర్తి కాలేదని, ఏప్రిల్‌లో ప్రహరీ నిర్మాణాన్ని మొదలు పెట్టి వచ్చే రబీ సీజన్‌కు లైనింగ్ పనులను పూర్తి చేస్తామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్ సీఆర్పీ డొంక, బాలాజీ నగర్ మస్జిద్ సెంటర్, ఏసీ స్థూపం, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా డివిజన్లలో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదాని తెలుసుకుని అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వేపల్లి కాలువ గట్టు, బాలాజీనగర్, సీఆర్పీ డొంక, ఉడ్‌హౌస్ సంఘం, తదితర ప్రాంతాల్లో సర్వేపల్లి కాలువకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణ పనులను ఏప్రిల్‌లో మొదలు పెడుతామన్నారు. వచ్చే సీజన్‌కు సర్వేపల్లి కాలువలో నీటి విడుదలను నిలిపి రబీ నాటికి లైనింగ్ పనులను నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. ప్రహరీ నిర్మాణ క్రమంలో దాదాపు 700 నుంచి 800 ఇళ్లకు గానూ పది ఇళ్లు మాత్రమే తొలగించే పరిస్థితి ఉంటుందన్నారు. వారికి ఆ ప్రాతంలోనే తిరిగి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. సర్వేపల్లి కాలువ గట్టుపై కొన్ని ప్రాంతాల్లో 20 నుంచి 30 అడుగుల మేర రోడ్డు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, స్థానిక కార్పొరేటర్ గణేశం సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సిటిజన్ ఔట్ రీచ్'ను విజయవంతం చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'సిటిజన్ ఔట్ రీచ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 25 అర్జీలు అందాయి. 'డయల్ యువర్ కమిషనర్'కు మరో 21 విజ్ఞప్తులు వచ్చాయి. నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కమిషనర్ సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతినెలా చివరి శుక్ర, శనివారాల్లో సచివాలయాల పరిధిలోని అన్ని కుటుంబాలను వలంటీర్లు, కార్యదర్శులు కలిసి ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్వీన్‌కు వివేకానంద ఐకాన్ అవార్డు



నెల్లూరు(వేదాయపాళెం): నగరానికి చెందిన ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ నిర్వాహకురాలు షేక్ పర్వీన్ స్వామి వివేకానంద ఐకాన్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని భారత వికాస్ పరిషత్ సమావేశమందిరంలో జాతీయ స్థాయిలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డుల ప్రధానోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు పర్వీన్ తెలిపారు. తమ సంస్థ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

కుష్టుపై అవగాహన

నెల్లూరు(అర్బన్): కుష్టు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంపీ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం కుష్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ అలేఖ్య , పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్పొరేటర్ సత్తార్, డివిజన్ అధ్యక్షుడు శేషయ్య, రూడ్స్ చైర్మన్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీ బలోపేతానికి కృషి

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో మహాజన సోషలిస్టు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ మాదిగ కోరారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నూతన కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కోఆర్డినేటర్లు శ్రీనివాస్‌మాదిగ, అంబేడ్కర్, రమేష్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



నెల్లూరు (టౌన్): తిరుపతిలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-19 బాలిక ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు కాంస్య పతకం సాధించింది. స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థినులు నాగమణి, మానస, మంజుల జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. నాగమణి, మానస జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు క్రీడాకారులను ప్రిన్సిపల్ గురవయ్య సోమవారం అభినందించారు. అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి పీ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



నెల్లూరు రూరల్: 39వ డివిజన్ వెంగళరావునగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు ఎల్ఐసీ, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్పొరేటర్ అవినాష్ చేతుల మీదుగా అందజేశారు. ఎల్ఐసీ మేనేజర్ చెన్నయ్య, రూడ్స్ అధ్యక్షుడు రసూల్, పీఎంపీ అధ్యక్షుడు వేణుగోపాల్, శ్రీనివాసులు, హెచ్ఎం నాగరాజారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫత్తేఖాన్‌పేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్-1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని టెక్కేమిట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమిషనర్ పీఆర్వోగా కృష్ణారావు

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ కమిషనర్ హరిత పీఆర్వోగా కృష్ణారావు నియమితులయ్యారు. గతంలో పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఇటీవల ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణారావును నియమిస్తూ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

దాడిపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): తమ్ముడిపై దాడి చేస్తుండగా అడ్డుకున్న అన్న కుటుంబంపై కొందరు కర్రలతో దాడి చేశారు.వివరాలు..మనుమసిద్ధినగర్ ఆరటితోటలో మల్యాద్రి, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి మహేష్, మనోజ్ కుమారులు. మాల్యాద్రి తమ్ముడు అనిల్‌కు అదే ప్రాంతానికి చెందిన నాగరాజుకు ఆర్థిక లావాదేవీల విషయమై పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 29న అనిల్‌పై నాగరాజు తన స్నేహితులతో కలిసి దాడిచేస్తుండగా మాల్యాద్రి దంపతులు, కుమారులు అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నాగరాజు తన స్నేహితులతో కలిసి అదే రోజు రాత్రి మాల్యాద్రి ఇంటికొచ్చి కుటుంబసభ్యులపై కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో గాయపడిన మహేష్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. ఈ మేరకు బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గాంధీకి నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి



వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో..



వైశ్యసమాఖ్య ఆధ్వర్యంలో..

నెల్లూరు(బారకాసు): మహాత్ముడు చూపిన సత్యం, అహింసా మార్గం అనుసరణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మాగుంటలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మంత్రి కాకాణి సోమవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ దేశస్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ముత్తుకూరు మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షుడు కేవీ చలమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. బాపూజీ జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. వైశ్య సమాఖ్య వివిధ విభాగాల నిర్వాహకులు ఆర్వీ శరత్, జేవీకే బాబు, ఎస్ నాగేశ్వరరావు, ఎన్ రవీంద్ర, ఎస్ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 203 గవర్నర్ ఎం వెంకటాద్రిరెడ్డి, కోశాధికారి శ్రీమన్నారాయణ, ఎస్ బలరామయ్యానాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, డీవీ పార్థసారధిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



నెల్లూరు(మినీబైపాస్): జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పేర్కొన్నారు. రేబాలవారి వీధిలోని జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో సోమవారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయుడుపేటలోని శిథిల గ్రంథాలయ భవనాన్ని కూల్చివేసి స్థానిక దాతల సహకారంతో రూ.20 లక్షలతో నూతన భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. వయోజన విద్య ఉపసంచాలకులు పీ రమేష్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ఉప విద్యాధికారి భిక్షాలు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజా పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(బృందావనం): 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీలోని షాహుల్ మీద్ ఖాదర్‌వలీ ఔలియా దర్గాలో గంధ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధోత్సవానికి హాజరైన భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముస్లిం సోదరులకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ కార్పొరేటర్లు షేక్ సఫియామున్జీర్, షేక్ కరీముల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరామొహిద్దీన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షాజహాన్, కార్పొరేషన్ కోఆప్షన్‌సభ్యుడు షేక్ అమీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్లాటను అడ్డుకోవాలని వినతి

నెల్లూరు(క్రైమ్): పేదల జీవితాలను నాశనం చేస్తున్న సింగిల్ నంబర్లాటను అడ్డుకోవాలని 16వ డివిజన్ సీపీఎం అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఏఎస్పీ డీ హిమవతికి 16వ డివిజన్ కమిటీ సభ్యులు, స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పొర్లుకట్ట, సంతపేట, బాలాజీనగర్, శెట్టిగుంటరోడ్డు, కోటమిట్ట, సారాయంగడి(ప్రగతినగర్) సెంటర్, డైకస్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో జూదం విస్తరిస్తోందన్నారు. దినసరి కూలీలు తమ సంపాదన మొత్తాన్ని ఆటకు వెచ్చిస్తుండడంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ నాయకులు కార్తీక్, వెంకటేష్, హనీఫ్, సీహెచ్ ప్రసాద్, రాజా, బాలు, వెంకటేశ్వర్లు, రమణ, సంపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముఖహాజరు మినహాయించాలి

నెల్లూరు(అర్బన్):మున్సిపల్ కార్మికులకు నూతనంగా ప్రవేశపెట్టిన ముఖహాజరు నుంచి మినహాయింపునివ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల్లో 90శాతం మందికి చదువు లేదన్నారు. స్మార్ట్‌మొబైల్స్, యాప్‌లపై అవగాహన లేనందున ముఖహాజరు సాధ్యం కాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘ నాయకులు నారాయణ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది నిరంకుశ పాలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని, దేశ సమైక్యత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా ముగియడంపై నగరంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోడో యాత్రకు కొనసాగింపుగా కాంగ్రెస్ పార్టీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 26 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించతలపెట్టిందని తెలిపారు. అనంతరం మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు సీవీ శేషారెడ్డి, సురేష్‌బాబు, భవానీనాగేంద్రప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, వెంకట్రావు, ఇంతియాజ్, అనిల్‌కుమార్, పవన్‌కుమార్, మహేష్‌రెడ్డి, అల్లావుద్దీన్, గణేష్‌బాబు, మంజుల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.